క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన ముంతాజ్‌బేగం అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఖర్చుల కోసం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో సీఎం ఆర్ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా రూ.15 వేలు మంజూరయ్యాయి. మంగళవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బాధితురాలు భర్త చాంద్‌పాషాకు చెక్కును బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, నాయకులు కృష్ణయ్య, రాజు, జంగయ్య, రవీందర్, అశోక్‌గౌడ్, విజేందర్, కొండల్, మల్లేశ్, యాదయ్య, శరత్, ప్రవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి చేయూత



యశస్వినిని సత్కరిస్తున్న ఉప్పల వెంకటేశ్

ఆమనగల్లు: నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్‌ను సాధించిన ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతండాకు చెందిన యశస్విని వైద్య విద్యకు అండగా ఉంటామని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మంగళవారం యశస్వినిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్య విద్యకు సహకరిస్తామని చెప్పారు. అలాగే తలకొండపల్లి మండలానికి చెందిన విద్యార్థినికి ట్రస్టు తరఫున రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్, కృష్ణయ్య, యాదగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో వైద్య శిబిరం

ఆమనగల్లు: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిపాలన శాఖ విభాగం ఏడీ జ్యోత్స్న దీన్ని ప్రారంభించారు. శిబిరంలో ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి మంజులాదేవి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ శంకర్‌నాయక్, ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి, వేణు, మున్సిపాలిటీ ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఏఈ శ్రీనివాస్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి



ఇబ్రహీంపట్నం: ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ఇబ్రహీంపట్నం: విద్యను వ్యాపారం చేస్తున్న స్కూల్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు బోడ వంశీ, కార్యదర్శి ఏర్పుల తరంగ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఈఓ హీర్యా నాయక్‌కు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, రాకేష్, రామ్‌చరణ్, హర్షవర్ధన్‌లు పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులు

కడ్తాల్: పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, యూనిఫామ్‌లు అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏబీవీపీ కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పవన్, నాయకుడు సందీప్ ఉన్నారు.

'లయన్స్' సేవలతో గుర్తింపు



మాట్లాడుతున్న మహేందర్‌కుమార్‌రెడ్డి

ఆమనగల్లు: లయన్స్ క్లబ్‌ల ద్వారా అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆ సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేందర్ కుమార్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం మైసిగండిలోని ఓ గార్డెన్స్‌లో సోమవారం రాత్రి ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరోత్సవం నిర్వహించారు. మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవకు మారుపేరుగా లయన్స్‌క్లబ్ నిలిచిందన్నారు. అధ్యక్షునిగా గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ఓగా పాషాలతో మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్యాంకుమార్ ప్రమాణస్వీకారం చేయించారు.



ఇబ్రహీంపట్నంలో బేస్‌మెంట్‌తో ఆగిపోయిన నిర్మాణం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి చదును చేసిన స్థలం

సొంతింటి కలకు చిక్కులు

- ఇందిరమ్మ ఇళ్లకు ముందస్తు పెట్టుబడే సవాల్
- ప్రభుత్వ నిబంధనలపై భిన్న స్వరాలు
- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు

ఇబ్రహీంపట్నం: పేదల సొంతింటి కల సాకారం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఆదిలోనే చిక్కుముళ్లు ఎదురవుతున్నాయి. రెక్కాడితేగానే డొక్కాడని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ముందస్తు వ్యయం పెద్ద సవాల్‌గా మారింది. మరోవైపు ఆర్థిక వనరులున్న వారు సైతం ప్రభుత్వ నిబంధనలతో సతమతమవుతున్నారు. ఇలాంటి పలు సందేహాల నడుమ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ముగ్గు పోసి, నిర్మాణాలు ప్రారంభించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో తొలి విడతలో 437 ఇళ్లు మంజూరయ్యాయి. గత నెల 21న స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందజేశారు. అందులో ఇప్పటి వరకు 210 ఇళ్లకు మాత్రమే ముగ్గులు పోసి, నిర్మాణాలు మొదలు పెట్టారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికార యంత్రాంగం ఒత్తిడి తీసుకొస్తున్నా పలువురు లబ్ధిదారుల్లో చలనం కరువైంది.

57 మంది అనాసక్తి

నిబంధనల ప్రకారం 400 ఎస్ఎఫ్‌టీ కంటే తక్కువ, 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ ఇంటి నిర్మాణం చేయవద్దు. ఎంపికైన వారిలో అధిక శాతం నిరుపేదలే కావడంతో బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేపట్టేందుకు ఆర్థిక వెసులుబాటు లేకపోవడం మరో ప్రధాన కారణం. అంతేగాక శిథిలావస్థలోని పాత ఇంటిని కూల్చేందుకు, బేస్‌మెంట్ వరకు కట్టేందుకు డబ్బులు లేక మరికొంత మంది ఇంటి నిర్మాణాన్ని వాయిదా వేసుకుంటున్నారు. 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టితే యాప్(జియోట్యాగ్) అంగీకరించదు. ఇవి లబ్ధిదారులకు అడ్డంకిగా మారాయి. మరోవైపు ఇళ్లు మంజూరైన 57 మంది నిర్మాణానికి అనాసక్తి చూపుతుండడం గమనార్హం.

ముందస్తు సాయంతో మేలు

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి దశల వారీగా ప్రభుత్వం నిధులను మంజూరు చేయనుంది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తయితే రూ.లక్ష, గోడలు కట్టిన తర్వాత రూ.లక్ష, స్లాబ్ వేశాక రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తి చేసుకొని పెయింటింగ్ పడగానే మరో రూ.లక్ష.. ఇలా నాలుగు విడతల్లో బిల్లు చెల్లించనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతలుండాల్సిందే. బేస్‌మెంట్ పూర్తవ్వగానే ఇచ్చే డబ్బులను ముందుగా చెల్లిస్తే తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయని ఇళ్లు మంజూరైన పేదలు అంటున్నారు.

అప్పు చేసి నిర్మాణం



లాండ్రీ షాపులో పనిచేసుకుంటూ ఇద్దరి పిల్లలను చదివిస్తూ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాను. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అప్పు చేసి బేస్‌మెంట్ వరకు పూర్తి చేశాను. ముగ్గు పోయగానే తొలి విడత రూ.లక్ష అందిస్తే పేదలకు ఆర్థిక భారం తప్పుతుంది. సాఫీగా ఇళ్ల నిర్మాణం జరిగే అవకాశం ఉంటుంది. దీనిపై పునరాలోచన చేయాలి.

– శ్రీలత, లబ్ధిదారు, ఇబ్రహీంపట్నం

నిబంధనలు సడలించాలి



శిథిలావస్థకు చేరిన పాత ఇంటిని కూల్చేశాం. నాకు 47 గజాలు వచ్చింది. నిబంధనల ప్రకారం 400 ఎస్ఎఫ్‌టీ కంటే తక్కువగా ఇంటి నిర్మాణం ఉండొద్దు. ఈ స్థలంలో 350 ఎస్ఎఫ్‌టీ లోపు ఇంటి నిర్మాణానికే అవకాశం ఉంది. తక్కువ ఎస్ఎఫ్‌టీలో నిర్మాణం జరుపుకొనేలా ప్రభుత్వం అనుమతిస్తే నాలాంటి ఎంతోమంది పేదలకు లబ్ధి చేకూరుతుంది.

– వెంకటేశ్, లబ్ధిదారుడు, ఇబ్రహీంపట్నం

210 ఇళ్లు ప్రారంభం



మున్సిపాలిటీలో 210 ఇంటి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పలు కారణాలు చెబుతూ కొంత మంది లబ్ధిదారులు వాయిదా వేసుకుంటున్నారు. సుమారు 57 మంది ఇంటి నిర్మాణానికి అనాసక్తి చూపుతున్నారు. ఆ ఇళ్లను జాబితాలోని అర్హులకు కేటాయిస్తాం. పది రోజుల్లో మిగిలిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమవుతాయని విశ్వాసం ఉంది.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

ఇబ్రహీంపట్నం సీడీపీఓ వినితాదేవి

ఇబ్రహీంపట్నం రూరల్: అంగన్‌వాడీల్లో 3 నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు సరైన పౌష్టికాహారం అందిస్తున్నామని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి పేర్కొన్నారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తులేకలాన్ అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలన్నారు. అక్కడ చిన్నారులు స్వేచ్ఛగా కథలు, పాటలు నేర్చుకుంటారన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీలో ప్రీ స్కూల్ విద్య కోసం పాఠ్యపుస్తకాలు, టైం టేబుల్, వర్క్ బుక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పల్లవి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఏఎన్ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ఆమనగల్లు: రెండేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిరేఖ కోరారు. మంగళపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం నిర్వహించిన అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అలాగే చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మ, టి.పద్మ, ఆయాలు వరమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల వికాసానికి..

మాడ్గుల: పిల్లల పరిపూర్ణ వికాసానికి అంగన్‌వాడీల్లో చేర్పించాలని మండల సూపర్‌వైజర్ జయమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. నిత్యం పోషకాలతో కూడిన ఆహారం అందించడంతోపాటు పిల్లల వయస్సుకు తగిన ఎత్తు, బరువుతో ఉండేలా చూస్తారన్నారు.



మాడ్గుల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఇబ్రహీంపట్నంరూరల్: తులేకలాన్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ వినితాదేవి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



గట్టుప్పలపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విష్ణుగౌడ్, శివకుమార్‌గౌడ్, రాజేందర్‌నాయక్, రేణురెడ్డి, డేవిడ్, తిరుపతిరెడ్డి, మచ్చేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



కడ్తాల్: భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్ గీత



అబ్దుల్లాపూర్‌మెట్: విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

గడ్డి అన్నారం ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలన్నదే ప్రజాప్రభుత్వం ఉద్దేశమని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనాజ్‌పూర్‌లో ప్రైమరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నదన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ బడులకు మహర్దశ రానున్నదనానరు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

కడ్తాల్: పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాటగీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం పాఠ్యపుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి అనిత, ఉపాధ్యాయులు విజయ, లక్ష్మి, సుజాత, మైత్రి, యేసుభా, రాధా, సిబ్బంది ఉన్నారు.

వేగంగా ఫోర్త్ సిటీ నిర్మాణం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం తీసుకున్న భూములను తిరిగి వెనక్కి ఇవ్వడం కుదరదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.1.80 కోట్లతో నిర్మించిన 17 మడిగెల సముదాయం, సీసీ రోడ్లను మార్కెట్ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రాంతానికి మహర్దశ పట్టనుందన్నారు. ఒకవైపు ఫోర్త్ సిటీ, మరో వైపు గ్రీన్ సిటీ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. పరిహారం చెల్లించిన ఫార్మాసిటీ భూములను తిరిగి రైతులకు ఇచ్చేందుకు నిబంధనలు ఒప్పుకోవన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నెలకొల్పేందుకు తాము ఒప్పుకునేది లేదన్నారు. ఫార్మాసిటీ స్థానంలో ఫోర్త్ సిటీ నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందన్నారు. జబర్దస్తీగా రైతుల నుంచి భూములను ప్రభుత్వం తీసుకోదని వెల్లడించారు. మార్కెట్ యార్డులో నిర్మించిన మడిగెల కేటాయింపులో రైతులకే ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డీడీఎం ప్రసాద్‌రావు, జిల్లా అధికారి ఎండీ రియాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మార్కెట్ కార్యదర్శి సంతోష్, డైరెక్టర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ప్రజాభవన్ వద్ద సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆరుట్ల, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్‌లో 435 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, 53మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే గాకుండా సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జయమ్మ, రమాకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, జంగయ్య, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం మడిగెల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆమనగల్లు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత అన్నారు. సర్కారు రైతు భరోసాకు నిధులు అందించినందుకు పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పెద్దఅంబర్‌పేటలో..

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పంది పెంటయ్య పేర్కొన్నారు. రైతు భరోసా పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.6000లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో మంగళవారం పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని ఇందిరాగాంధీ చౌక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



ఆమనగల్లు: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ గీత

కడ్తాల్‌లో..

కడ్తాల్: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వానకాలం పంట పెట్టుబడి సాగుకు, రైతు భరోసా క్రింద ఎకరాకు రూ.6 వేలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.



కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఇబ్రహీంపట్నం: భూ భారతి చట్టంపై గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు మండలంలో మంగళవారం ముగిశాయి. తహసీల్దార్ సునితారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి ఈనెల 3 నుంచి 17వ తేదీ వరకు మొత్తం 31 రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులను నిర్వహించారు. చివరి రోజు మంగళవారం ఇబ్రహీంపట్నం ఖాల్సా, రాందాస్‌పల్లి గ్రామాల్లో సదస్సులు కొనసాగాయి. మొత్తంగా 1238 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ముకునూర్ 17, ఎర్రకుంట 4, ఖానాపూర్ 117, కప్పహాడ్ 42, నాగన్‌పల్లి 95, పోల్కంపల్లి 42, రాయన్‌గూడ 26, నెర్రపల్లి 10, పోచారం 18, రాంరెడ్డిగూడ 4, ఇబ్రహీంపట్నం భాగయత్ 121, తట్టిఖానా 10, అల్లిమియాపంపు 1, చింతపల్లిగూడ 3, మంగల్‌పల్లి 26, సాహెబ్‌గూడ 2, కొంగరకలాన్ 6, ఫిరోజ్‌గూడ 3, ఇబ్రహీంపట్నం ఖాల్సా 206, ఎలిమినేడు 126, తాడ్లకల్వ 2, ఆదిభట్ల 28, తులేకలాన్ 89, బొంగ్లూర్ 11, దండుమైలారం 110, రాందాస్‌పల్లిలో 119 దరఖాస్తులు ఈ సదస్సుల్లో రెవెన్యూ అధికారులకు అందాయి.

కడ్తాల్‌లో భారీగా భూ సమస్యలు

కడ్తాల్: భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా, ఈ నెల 3 నుంచి 17వ తేదీ(మంగళవారం) వరకు మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణం తక్కువగా ఉండటం, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, వారసత్వ పట్టా అమలు తదితర సమస్యల పైనే ఎక్కువగా దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మండల పరిధిలో 969 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ సదస్సులలో అర్జీ ఇవ్వలేకపోయిన వారు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు. మంగళవారం మైసిగండిలో రెవెన్యూ సదస్సు నిర్వహించినట్లు తహసీల్దార్ షేక్ ముంతాజ్ తెలిపారు.

గ్రామాల వారీగా దరఖాస్తులు

ముక్తమాధారం 26, వాస్‌దేవ్‌పూర్ 14, రావిచేడ్ 34, నాగిరెడ్డిగూడ 02, సాలార్‌పూర్ 26, టాక్‌రాజ్‌గూడ 06, కడ్తాల్, మైసిగండిలో 536, న్యామతాపూర్ 38, వంపుగూడ 09, చల్లంపల్లి 41, చరికొండ 49, ఎక్‌రాజ్‌గూడ 0, ముద్విన్ 112, కర్కల్ పహాడ్ 76 అర్జీలు వచ్చాయి.

సందిగ్ధంలో రైతులు

తమ భూములకు సంబంధించిన సమస్యలపై రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ సారైన పరిష్కారం లభిస్తుందా.. లేదాని సందిగ్ధంలో పడ్డారు. గతంలో అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా భూ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో, భూ భారతి చట్టంలోనైన తమ భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సదస్సులు వినియోగించుకోవాలి

అబ్దుల్లాపూర్‌మెట్: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం పెద్దఅంబర్‌పేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీ, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాజేందర్‌ముదిరాజ్, నాయకులు పండుగుల రాజు, దయాకర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితాను తొలగించండి

ఇబ్రహీంపట్నం రూరల్: రెవెన్యూ సదస్సుల అనంతరం ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలోనే భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో చివరి రోజు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా 119 ఫిర్యాదులు రైతులు అందించారు. ఇందులో పీఓబీ 57, బాండెడ్ లేబర్ 40, అసైన్‌మెంట్ ల్యాండ్ 44, పేరు మార్పిడి 6తో పాటు ఇతర సమస్యలపై ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. గ్రామంలో సర్వే నంబరు 41లో 1251 ఎకరాల భూమి నిషేధిత జాబితాలో చూపిస్తుందని, దాన్ని తొలగించాలని రైతులు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.



అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



కడ్తాల్: మైసిగండి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకుంటున్న రైతులు



ఇబ్రహీంపట్నం ఖాల్సాలో దరఖాస్తులు తీసుకుంటున్న తహసీల్దార్